

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 ఆగస్టు, 2010 సంచిక : 3

(వికృతి నామ సం॥, శ్రావణ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు

(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech

శ్రీ సిహెచ్.వి. సుబ్బారావు M.A,B.Ed.

**సాయివాణి చందా వివరాలు**

విడి ప్రతి .......... రూ॥ 6/-

వార్షిక చందా .......... రూ॥ 60/-

ఆజీవన సభ్యత్వం .......... రూ॥ 600/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

Ph : 08685-326053

9440413455, 9848133565

**విషయసూచిక** **పుటసంఖ్య**

మా వాణి ........ 2

గ్రహణాలు-చమత్కారాలు ........ 5

శీలం యొక్క గొప్పదనము ........ 7

ఆదిగురువు-దత్త ప్రభువు ........ 10

బాలవాణి ........ 13

గర్వభంగం ........ 14

My Pet Pup ........ 19

జెంటిల్‌మన్ అంటే ........ 20

శరణం ప్రపద్యే ........ 21

అవసరము-ఆశ ........ 22

పుట్టినదినము పండుగ ........ 24

కంఠస్థ యోగ్య పద్యాలు ........ 27

నిష్కామ కర్మ ........ 29

జైలు అనుభవాలు ........ 30







## మా వాణి

సూర్యుడు పగటి వెలుగు. రేరాజు రాత్రి వెలుగు. కానీ ఆ వెలుగులు ఆయా వేళలలోనే ఉంటాయి. వెలిగే దివ్వెలకు ఆధారం తైలం. అది అయిపోయిన మరుక్షణం వెలుగుండదు. మరైతే ఆరని వెలుగేది? లోలోపల వెలిగేదే అసలు వెలుగు. అది జ్ఞాన దీప్తి. జ్ఞానదీప్తికి మూలం సంస్కారం. శాస్త్రాలు, వేద వేదాంతాలు, ఎన్నెన్నో మహద్గ్రంథాలు చదివితే కలిగేది. విషయ పరిజ్ఞానం. ఇది ఒక్కో గ్రంథం చదువుతున్న కొద్దీ వికసించనూ వచ్చు. ఒక్కో గ్రంథం ఒక్కో వైపుకు లాగుతోంటే గందరగోళంలోబడి ప్రక్కదారులు పట్టనూ వచ్చు. కేవలం విషయపరిజ్ఞానాన్నే విద్య అనుకోవడానికి వీలు లేదు. అదే విద్యయితే నేటి మన సమాజం అంతా ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, సైంటిస్టులు వగైరా వగైరా విద్యావంతులతో నిండి ఉన్నదనుకోవాలి. కవులకూ, మేధావులకూ, కళాకారులకూ కూడా కొరవ లేదు. అయినాగానీ దేశం చిమ్మచీకట్లోనే ఉండి పోయినట్లుగా ఉంది. కారణం? ఇవేవీ వెలుగిచ్చే చదువులు కావు గనుక. మరి వెలుగెలా వస్తుంది? సంస్కారవంతమైన విద్య వలన - ధార్మికమైన నడవడి వలన - తరతరాల సంస్కృతినీ, విలువలనూ కాపాడుకొంటూ జీవించటం వలన. మరి ఇవెలా వస్తాయి? అచ్చపు విద్యల వలన. "చదువులలో గల మర్మమెల్ల చదివితి"నన్న మాదిరి విద్యల వలన.

"విద్యా దదాతి వినయం వినయాత్ యాతి పాత్రతా,

పాత్రత్వాద్ధన మాప్నోతి, ధనాద్ధర్మం తతస్సుఖమ్"

- విద్య వలన వినయం, వినయం వలన యోగ్యత, యోగ్యత వలన సంపద, దాని వలన దానధర్మాలు చేసే శక్తి, వాటి వలన సుఖం (అలౌకిక)

లభిస్తాయన్నది ఆర్యవాక్కు. ఒక మనిషి సంస్కారం వేటి వలన నిర్ణయిస్తాము? ఆ వ్యక్తి మాట తీరు, వేష భాషలు (ఇది కొంతవరకే) పరోపకార గుణం, వినయం, దేశభక్తి, స్థిరచిత్తం, ప్రేమ, స్నేహం - వీటన్నింటి ద్వారా సంస్కారం బయటపడుతుంది.

కొందరు వ్యక్తులు తమను గూర్చి తాము చాలా ఘనంగా భావించుకొంటుంటారు. ఏదో లోపల్లోపల భావించుకోవటమే కాదు. పైకి చెప్పకొంటుంటారు కూడా. ప్రతి మనిషీ తన జీవితంలో ఏదో కొంత ఘనత - చదువులోనో, ఉద్యోగ జీవితంలోనో, కళల్లోనో, సంసారంలోనో సాధించే ఉంటాడు. ఆ ఘనత తనకు మనోబలాన్నీ, ఆనందాన్నీ కలిగించి ఆపై జీవితంలో ప్రోత్సాహం అందించీ ఉండవచ్చు. అంతమాత్రాన అదేమీ మానవ జీవిత సాఫల్యం కాదు గదా! ముక్తి మార్గానికి చివరి మెట్టు కాదు గదా! అది మర్చిపోయి, ఆ ఘనతకే ఎంతో పొంగిపోతూ పదే పదే వాటి గురించే వినే వాళ్ల చెవులు హోరెత్తేలాగా, వాళ్లకు కంఠస్థం వచ్చేలాగా చెప్తూ ఉంటారు. అలా చెప్పగా చెప్పగా నిజంగానే మహా ఘనులమనే భావన తమ మనస్సుల్లో పాతుకొని పోతుంది. ఇక ఆ మాయ నుండీ బయటకు రావటం చాలా కష్టం.

రావణుడు మహా బలశాలీ, గొప్ప రాజనీతి పరుడూ, పరమ మాహేశ్వరుడున్నూ. కానీ గొప్ప అహంభావి. తన ఎదురుగా రణరంగంలో నిలచిన శ్రీరాముడిని చూచి ఆయన అన్నాడట. “ఓరీ బక్క మానవా, నీవా నన్ను గెలిచేది! అన్యాయంగా చచ్చిపోతావు. వెనక్కు తిరిగి వెళ్లిపో” - అని. అందుకు జవాబుగా రాముడిలా అన్నాడట - “మా రాజ్యంలో మూడు రకాల వృక్షాలుంటాయి. కొన్ని పూలు పూస్తాయిగానీ కాయలు కాయవు. కొన్ని పుష్పిస్తాయి, ఫలిస్తాయి కూడా. మరికొన్ని చెట్లు చాలా అరుదైనవి. అవి పుష్పించవు. తిన్నగా కాయలే కాస్తాయి. అలాగే మనుష్యుల్లో కూడా కేవలం మాటల మనుషులు, మాటలూ, చేతలు రెండూ వచ్చినవారు, వాక్శూరులు





కాకుండా కేవలం కర్మయోగులు - ఇలా మూడు రకాలు ఉంటారు. యుద్ధ రంగాన మాటలతో పని ఏమున్నది?” దీన్ని బట్టి కార్యశీలుడైనవాడు పొదుపుగా మాట్లాడుతాడనీ, ముఖ్యంగా తన ఘనతను చెప్పకోడనీ తెలుసుకోగలం.

అంతేకాదు- సంస్కారవంతుడు ఒక్కొక్కరోజు ఒక్కోలాగా ప్రవర్తించడు. స్థిరచిత్తంతో ఉంటాడు. తాను చేసే మంచి పనిని భూతద్దంలో చూచుకొని పొంగిపోవటం, ప్రకటించుకోవటం చేయడు. అలాగే స్వప్రయోజనాన్నీ, స్వసుఖాన్నీ లెక్కచేయడు. తానెంత ఎత్తుల కెదిగినా గతాన్నీ, మూలాన్నీ మరచిపోడు. దైవాన్నీ, దేశాన్నీ సమభావంతో ప్రేమిస్తాడు. మనం సాయిభక్తులం. “బాబాగారిష్టం అంతా” అంటాం. “బాబా చెప్పినట్లే ఆచరిస్తున్నామ”ని భావిస్తాం. దీన్ని నిశితంగా విశ్లేషించి చీల్చి చూస్తే “మనం నిజంగా అలా ఉన్నామా? ఆత్మవంచన చేసుకుంటున్నామా? లేదా?” అన్నది తెలుస్తుంది.

వినయం, సంస్కారంలో ఒక ముఖ్యభాగంగా చెప్తారు పెద్దలు. మనం ఎవరికైనా ఏదైనా సేవ చేస్తున్నపుడు తల్లిదండ్రుల సేవైనా సరే - అవతలివాడు భగవత్స్వరూపుడన్న భావంతో చేస్తున్నామా, ఎవరి మెప్పల కోసమైనా కృతజ్ఞత కోసమైనా చేస్తున్నామా, తప్పదని చేస్తున్నామా - ఆత్మానందం కోసం చేస్తున్నామా - అన్న విశ్లేషణ అవసరం. మన మెంత; మన స్థాయి ఎంత - యీ విశాల విశ్వంలో? ఇక విశ్వవిభుని చెంత యింకెంత? అలా తరచి చూస్తే అహం నశించి వినయమే పెరుగుతుంది. అది కూడా నిజాయితీతో చూస్తేనే సుమా!

మొత్తం మీద యిటువంటి శుభగుణాలున్న విద్యే లోవెలుగవుతుంది. ఆరని వెలుగవుతుంది. మనకున్న డిగ్రీలన్నీ కలిసి ఒక్క వెలుగురేఖనైనా యివ్వలేవు. అంచేత అటువంటి గొప్ప విద్య నేర్చుకొనే ప్రయత్నం మొదలుపెడదాం.



# గ్రహణాలు-చమత్కారాలు

- శ్రీ మహీధర నళినీమోహన్‌గారి 'గ్రహణాలు' కథ నుండి

వేదకాలంలోనే గ్రహణాల ప్రస్తావన ఉంది. గ్రహణాలంటే మన వారికి రాహు కేతువులు సూర్యచంద్రులను మ్రింగుతారన్న మాదిరి భ్రమలున్నప్పటికీ (కేవలం భ్రమలు కావేమో- గ్రహణ సమయంలో సూర్యచంద్రులకు అడ్డు వచ్చేవి మన వాళ్ళు వర్ణించే రాహుకేతువుల ఆకృతులలో ఉంటాయేమో - యింకా పరిశోధనలు సాగుతూనే వున్నాయి) శాస్త్రీయ దృక్పథంతో వివరించటమూ జరిగింది. అయితే గ్రహణాలను సైతం తమకు అనుగుణంగా మలుచుకొన్న కొంతమంది తెలివిగల వారి విషయాలిక్కడ పొందుపరిచాము.

మార్క్‌ట్వేన్ వ్రాసిన ....... అనే పుస్తకంలో ఒక చిత్రమైన సంఘటన వర్ణింపబడింది. అది క్రీ.శ.528 జూన్ 21వ తేదీ. ఆ రోజున మిట్టమధ్యాహ్నవేళ ఒక యాంకీకి సజీవదహన శిక్ష జరిపించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అప్పుడు ఆ యాంకీ తన స్నేహితుడు క్లారెన్సుతో ఇలా అన్నాడు. "నువ్వు వెంటనే రాజుగారి దగ్గరకెళ్ళి ఆయనతో నా మాటగా చెప్పు. నన్ను సజీవదహనం చెయ్యాలనుకున్న సమయంలో నా శక్తి చేత సూర్యుణ్ణి నల్లగా మార్చేస్తాను. ఆకాశంలో సూర్యుడే లేకుండా పోతాడు. సూర్యరశ్మి లేక చెట్లు కృశించిపోతాయి. పళ్ళూ, కాయలూ, ధాన్యం కుళ్ళిపోతాయి. సమస్త జీవరాసులూ నాశనమైపోతాయి జాగ్రత్త".

ఆ రోజున మిట్టమధ్యాహ్నం 12 గంటల 3 నిమిషాలకి సంపూర్ణ సూర్యగ్రహణం మొదలవుతుందని ఆ యాంకీకి తెలుసు.

అతణ్ణి స్తంభానికి కట్టేశారు. ఆస్థాన ఇంద్రజాలికుడు మెర్లిన్ కాగడా చేత బట్టుకుని వచ్చాడు. నిప్పు ముట్టించడానికి. అంతలో కదిలివస్తున్న చంద్రుడు సూర్యబింబపు అంచును చుంబించాడు. సూర్యబింబం క్రమక్రమంగా నల్లబడ సాగింది. కొద్దిసేపట్లోనే సూర్యుడు మాయమైపోయాడు. అంతటా చీకటి. లక్షలాది ప్రజలు భయంతో బిర్రబిగుసుకుపోయారు. మిట్టమధ్యాహ్నవేళ ఆకాశాన నక్షత్రాలు కనిపించాయి. హడలిపోయిన రాజు యాంకీని విడిచి పెట్టమని ఆజ్ఞాపించాడు. మెర్లిన్‌ని దేశం నుంచి వెళ్ళగొట్టించాడు. అంతలో






సూర్యుడు విదిలించుకుని బయటపడటం మొదలుపెట్టాడు. ప్రజల సంతోషానికి అవధులు లేవు. యాంకీని భుజాల మీద ఎక్కించుకున్నారు.

**అలాటిదే మరొకటి :-**

క్రీ.శ.1504వ సంవత్సరంలో కొలంబస్ అమెరికాతీరం చేరుకున్నప్పుడు అక్కడి రెడ్ ఇండియన్‌లు కొలంబస్ పరివారానికి తిండి, సరుకులు అందకుండా చేసి చాలా ఇబ్బందిపెట్టారు. అప్పుడు చటుక్కున కొలంబస్‌కి జ్ఞాపకం వచ్చింది - ఆ ఏడాది ఫిబ్రవరి 29వ తేదీని చంద్రగ్రహణం పడుతుందని. ఒకరోజు ముందర అతడు రెడ్ ఇండియన్ నాయకుడితో ఇలా అన్నాడు : 'మీరు మాతో సహకరించకుండా ఇబ్బందిపెడుతున్నందుకు మా క్రిస్టియన్ దేవుడికి మీమీద చాలా కోపం వచ్చింది. మీ దేశాన్ని కరువు కాటకాలలో ముంచేస్తాడు. మహమ్మారిని పంపిస్తాడు. మా దేవుడి కోపానికి గుర్తు ఏమిటో తెలుసా? రేపు రాత్రి మీ చంద్రుణ్ణి మాయం చేస్తాడు. చూస్తూ ఉండండి!" మరునాడు పూర్ణిమ. రెడ్ ఇండియన్‌లు వెన్నెల్లో సంబరాలు చేసుకొందామని తయారవుతూ ఉండగా గ్రహణం మొదలైంది. క్రిస్టియన్ దేవుడికి నిజంగానే కోపం వచ్చిందని నమ్మి, కొలంబస్‌ను క్షమించమని వేడుకున్నారు. అతడు తనతో సహకరిస్తే వారిని క్షమించమని తమ దేవుడికి సిఫారసు చేస్తానని మాట ఇచ్చాడు. వెంటనే వారంతా అంగీకరించారు. వారందరూ చూస్తుండగానే చంద్రుణ్ణి చీకట్లోంచి బయటకు రప్పించాడు కొలంబస్.

(13వ పేజీ తరువాయి)

**ఇచ్చిపుచ్చుకో**

తెల్లబోయిన భిక్షుకుడు ఆ పాత్రలో బియ్యం తన జోలెలో పోసుకుంటుంటే- అందులో అతనికి అయిదు బంగారునాణాలు దొరికాయి. భిక్షకుడు సిగ్గు పడ్డాడు. "ఇందాక తాను ఆ పెద్దమనిషి ఏమీ ఇవ్వకుండా వెళ్ళిపోతుంటే పిసినారి వాడని తిట్టుకున్నాడు. నిజానికి తానే పిసినారివాడు. అప్పుడు నా పాత్రలోని బియ్యం అన్నీ ఇచ్చుంటే వందలకొద్దీ బంగారునాణేలు దొరికేవి గదా ఇప్పుడు. అందుకే పెద్దలు "ఇచ్చిన వచ్చును" అంటారు" అని అనుకున్నాడు. చూసారా పిల్లలూ, భగవంతుడిది కూడా ఈ ఇచ్చిపుచ్చుకునే సిద్ధాంతమే.

# శీలం యొక్క గొప్పదనము

**- స్వామీజీ**

ఏ మనిషికైనా ప్రజల నుండి గౌరవాదరాలు, సుఖశాంతులు దొరికేది అతని మంచి ప్రవర్తన వలననే. దీన్నే మంచి శీలము అంటారు. శీలము లేని వానికి ధనము ఉన్నా, అధికారము ఉన్నా, ప్రజలు కొంత గౌరవించినట్లు కన్పిస్తారు కాని, అది మనస్ఫూర్తిగా కాదు. అది నిజమైన గౌరవం కాదు. ఆ సంపద ఎక్కువకాలం నిలకడగా నిలవదు కూడా.

శీలం వలన కలిగే గొప్పదనము ఏమిటో, దాన్ని పోగొట్టుకుంటే వచ్చే నష్టమేమిటో తెలియజేసే ఒక మంచిగాథ భారతగ్రంథంలో ఉంది. ధృతరాష్ట్రుడు తన కుమారుడైన దుర్యోధనుని మనస్సు మార్చే ప్రయత్నంలో ఈ గాథను చెప్పాడు :

హిరణ్యకశ్యపుడనే మహాపరాక్రమశాలి, తపశ్శాలి- అయినా విష్ణుద్వేషి అయిన రాక్షసరాజు ఉండేవాడు. అతని కుమారుడే ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు తల్లి గర్భంలో ఉన్నప్పుడే అదృష్టవశాత్తూ నారద మహర్షి వలన భగవంతుని కథలు విన్నాడు. అంచేత పుట్టకముందే భగవద్భక్తి పెరిగింది. దాంతోపాటు మంచి గుణాలు కూడా అలవడ్డాయి. పసితనంలోనే గొప్ప భక్తుడై తండ్రిలోని రాక్షస లక్షణాలను ఎదిరించి గెలిచి నిలిచాడు. అన్ని విద్యలను శ్రద్ధగా నేర్చుకుని సమర్థుడైనాడు. జనరంజకంగా పరిపాలించటమేగాక స్వర్గం మీద కూడా దండెత్తి ఇంద్రుణ్ణి తరిమివేసి ముల్లోకాలను ధర్మయుక్తంగా పరిపాలించటం ప్రారంభించాడు. పదవిని పోగొట్టుకొన్న ఇంద్రుడు తనకు ముల్లోకాధిపత్యం మళ్ళీ ఎలా వస్తుందో చెప్పవలసిందని తన గురువైన బృహస్పతిని ప్రార్థించాడు. ఈ విషయంలో భార్గవుణ్ణి అడగమని బృహస్పతి సూచించాడు.

ఇంద్రుడు వెళ్ళి భార్గవుణ్ణి ఆశ్రయించాడు. "నిన్ను ఇంత అవలీలగా జయించే శక్తి, ముల్లోకాలను యింత రంజకంగా పరిపాలించే శక్తి అతనికి ఎలా వచ్చిందో అతన్నే అడిగి తెలుసుకొని ఉపాయంగా ఆ శక్తిని అడిగి పుచ్చుకొమ్మ"ని సలహా యిచ్చాడు భార్గవుడు.

ఇంద్రుడు బ్రాహ్మణ వేషం ధరించి ప్రహ్లాదుడి దగ్గర శిష్యుడిగా చేరి భక్తితో





సేవలు చెయ్యటం ప్రారంభించాడు. ఈ విధంగా చాలాకాలం సేవలు చెయ్యగా చెయ్యగా ప్రహ్లాదునికి అతని మీద దయ గలిగింది.

"నాయనా, దేనిని కోరి నీవు ఇంతగా నన్ను సేవిస్తున్నావు?" అని ప్రహ్లాదుడు ప్రశ్నించాడు.

"అయ్యా, మీకు ఈ ముల్లోకాలను (స్వర్గ, మర్త్య, పాతాళాలను) పరిపాలించే అవకాశం, శక్తీ ఎలా వచ్చాయో తెలుసుకోవాలని కోరికగా ఉందన్నాడు ఆ కపట బ్రాహ్మణుడు. "ఇదేమీ పెద్ద రహస్యం కాదు. నేనెప్పుడూ రాజుననే గర్వంతో ప్రవర్తించను. నా ప్రవర్తన ద్వారా ఎవ్వరినీ నొప్పించను. ఈర్ష్య, అసూయ, పగ, ద్వేషం వంటి దుర్గుణాలను వేటినీ మనస్సులోనికి రానివ్వను. త్రికరణ శుద్ధిగా (ఏది ఆలోచిస్తానో అదే చెప్పటం, ఏది చెబుతానో దాన్నే ఆచరించటం) ప్రవర్తిస్తాను. నాకు ఎవరు ఏ చిన్న మేలు చేసినా దానికి ప్రతిఫలంగా ఎన్నో రెట్లు మేలుచేస్తాను. ఎవరేది అడిగినా లేదనకుండా సంతోషపెడతాను. నా పూర్వ పుణ్యం వలన బ్రహ్మర్షులు మెచ్చుకొనే శీలం నాకున్నది. ఈ కారణం చేతనే నాకింతటి మహోన్నత పదవి లభించింది" అన్నాడు ప్రహ్లాదుడు.

"అయ్యా! నీవు నిజంగా మహాత్ముడవు, దానశీలివి. నాయందు దయ తలచి నీ శీలాన్ని నాకు ప్రసాదించు" అని ఇంద్రుడు దీనంగా వేడుకున్నాడు.

ఈ యాచనలోని కపటం గ్రహించని ప్రహ్లాదుడు అతని వేడికోలుకు కరిగిపోయి "సరే" అన్నాడు.

ఇంద్రుడు పన్నిన పన్నాగానికి బలి అయినాడు ప్రహ్లాదుడు. ఆ వెంటనే ప్రహ్లాదుడి శరీరంలోంచి మహాతేజస్వి అయిన ఒక పురుషుడు బయటకు వచ్చాడు.

అతనిని చూచి ప్రహ్లాదుడు "నీవెవరు" అని ప్రశ్నించాడు. "నేను నీ శీలాన్ని, నీవు నన్ను ఆ విప్రునికి దానం చేశావు గదా! అందుచేత నేను అతని దగ్గరకు వెళ్ళిపోతున్నాను" అంటూ వెనక్కు తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు ఆ దివ్యపురుషుడు.

అతని వెనుకనే ప్రహ్లాదుని శరీరంలోంచి ఒక్కొక్క వెలుగూ బయటకు వెళ్ళిపోవటం ప్రారంభించాయి.

ఒక్కొక్క వెలుగూ రావటమూ ప్రహ్లాదుడు ఆశ్చర్యంతో అడగటమూ

ప్రహ్లాదుడు : "నీవెవరు మహానుభావా?"

"నేను సత్యాన్ని, శీలము ఎక్కడుంటే అక్కడే దాన్ని ఆశ్రయించుకొని ఉంటాను. శీలం పోయిందిగా! నేను పోతున్నాను".

ఇంకో తేజస్సు బయటకు వచ్చింది.

"నువ్వెవరు మహాశయా?"

"నేను ఋజువర్తనను (నిష్కాపట్యాన్ని) సత్యాన్ని ఆశ్రయించి బ్రతుకుతాను. నేనూ పోతున్నాను".

"నీవెవరు మహానుభావా?"

"నేను బలాన్ని సత్ప్రవర్తన ఉన్నచోటనే నేనూ ఉంటాను. నేనూ పోతున్నాను".

ఇలా ఒక్కొక్క తేజస్సూ బయటకుపోతుంటే దిగులుపడి నీరసించి ప్రహ్లాదుడు దుఃఖంతో కుములుతున్నాడు. ఇంతలో ఒక గొప్ప సౌందర్యవతి అయిన స్త్రీ మూర్తి అతని శరీరంలోంచి బయటకు వచ్చింది.

"అమ్మా! నీవెవరు?"

"నేను లక్ష్మిని (సంపదను), బలం ఎక్కడుంటే అక్కడే ఉంటాను. నేను కూడా శీలసంపద లేని నిన్ను వదలి వెళ్లిపోతున్నాను".

"అయ్యో! తల్లీ! నీవు కూడా నన్ను విడిచి వెళ్లిపోతున్నావా? ఇంతకూ ఇంత కాలమూ నన్ను వినయంగా సేవించి, నా శీలమును యాచించిన ఆ విప్రుడెవరు తల్లీ!" అని ఆ లక్ష్మిదేవిని అడిగాడు ప్రహ్లాదుడు.

"అతను ఇంద్రుడు. నీ వైభవాన్ని కాజేసిపోవాలనే ఉద్దేశ్యంతోనే వచ్చాడు. నీవాతని మాయలో చిక్కుకొని నీ శీలాన్ని అతనికి ధారపోసావు.

శీలం వలన ధర్మం, ధర్మం వలన సత్యం, సత్యాన్ని అంటి మంచి నడవడి, దాని వెంట బలం, దాన్ని ఆశ్రయించి నేనూ (సిరి) ఉంటాం. కనుకనే అన్నిటికీ శీలమే మూలమని చెబుతారు. నీవు దాన్ని పోగొట్టుకున్నావు. అంచేత నేనిక నీ దగ్గర ఉండటం అసంభవం" అంటూ వెళ్లిపోయింది శ్రీదేవి".

- శీలం యొక్క గొప్పదనాన్ని ఇంతగా వివరించి చెప్పినా దుర్యోధనుడు తండ్రి మాటలను పెడచెవిని పెట్టాడు. సర్వసంపదలూ, చివరికి అర్థాంతరంగా ప్రాణంతోసహా పోగొట్టుకున్నాడు. శీలవంతులైన పాండవులు సకల సంపదలూ పొంది సుఖశాంతులతో జీవితాల్ని గడపగలిగారు.





# ఆదిగురువు - శ్రీ దత్త ప్రభువు

**(గత సంచిక తరువాయి)**

అర్జునుడు జ్ఞానార్థియై దత్తుని ఆశ్రమానికి వెళ్లాడు. సహ్యాద్రులలో ధ్యాననిష్ఠుడై కూర్చున్నాడు స్వామి. ఆయన ముందు సాష్టాంగ ప్రణామాలు చేసాడు అర్జునుడు. దత్తుడు కన్ను విప్పలేదు. శిష్యుడు తీరుతీరుల ప్రార్థనలు చేసాడు. "నిత్యముక్తుడవైన ఓ స్వామీ! నన్ను కరుణింపవయ్యా! శరణాగతులైన వారికి భవభయాలన్నిటినీ మొదలంటూ నాశనం చేసి ముక్తిమార్గం వైపు నడిపే స్వామివి నీవే. నీ మాయా విలాసంగా జరిగే సృష్టి, స్థితి, లయాలను బ్రహ్మరుద్రాదులే తెలియనేరరని పెద్దలు చెప్తారు. మేము జన్మజన్మల కర్మల ఫలాలకు బద్ధులం. ఐహిక విషయాలకు లొంగి జీవించే అల్పులం. నిన్ను మేమేమి గ్రహించగలం? అసత్యమైన ప్రపంచాన్ని సత్యంగా భ్రమింపజేసే మా బుద్ధి నిన్నేమి గ్రహించగలదు? నిత్య సత్యుడవూ, చిదానందమూర్తివీ అయిన నీ పరతత్త్వం నీవు చెప్పకుండా నా అంతట నేను గ్రహించగలనా స్వామీ! నశ్వరమైన యీ ప్రపంచంలోని విషయాలే నిత్యమని భ్రమించి ఎంత జీవితం వ్యర్థం చేసుకున్నాను! నిత్యం నీ పాద కమలాలనే ఆశ్రయించుకొని ఉన్న నన్నే యింతగా మాయ ముంచివేసిందంటే నేనెంత దౌర్భాగ్యుడినో స్వామీ! నాకు బ్రహ్మ జ్ఞానం ప్రసాదించు తండ్రీ!" ఎన్ని ప్రార్థనలు చేసినా దత్తుడు కనులు విప్పనే లేదు.

కార్తవీర్యార్జునుడు అలా ప్రణమిల్లుతూ, స్తుతిస్తూనే ఉన్నాడు. తెల్లవారబోతున్నది. తొలిప్రొద్దు పొడుపు అరుణిమలో అనేకులైన సిద్ధులు వచ్చి దత్తునికి నమస్కరించి వెళ్లిపోయారు. దత్తుడు కళ్లు తెరిచాడు. కానీ, అర్జునుని వైపు చూడనే లేదు. తిన్నగా వెళ్లి తన నిత్యకృత్యాలు పూర్తి చేసుకున్నాడు. దేవ, ఋషి, పితృతర్పణాలను యథావిధిగా సమర్పించాడు. మధ్యాహ్నమైంది. కొల్హాపురం వెళ్లి లక్ష్మీదేవి చెంత భిక్ష చేసాడు. ఆయన తిరిగి వచ్చి తన ఆసనం పైన కూర్చోగానే యోగనిష్ఠు లైన మునులనేకులు వచ్చి

ఆయన చుట్టూ కూర్చున్నారు. కార్తవీర్యార్జునునికి మనసులో ఏదో సంకోచం- విచారం. తానింత కాలం కేవలం గురువుగానే భావించిన దత్తస్వామిని దివ్యులూ, మునులూ, సిద్ధులూ కూడా సేవిస్తున్నారంటే ఆయన ఎదుటికి వెళ్ళగల అర్హతైనా తనకున్నదా! అతని కన్నులు చెమరించాయి. దత్తునికి దూరమైపోయిన భావన - దాన్ని సహించలేని దుఃఖం. అర్జునుని ఆ స్థితిని గమనించిన శాంత తపుడనే ముని అతన్ని దగ్గరకు పిలిచి దత్తుని ఎదుట కూర్చుండబెట్టాడు.

"ఏమి నాయనా! జంకుతున్నావేం? నీ మనసులో ఉన్నదేదో బయటకు చెప్పవయ్యా!" అన్నాడు శ్రీదత్తుడు ఆప్యాయంగా అతని కళ్లలోకి చూస్తూ. అర్జునుడు ధైర్యం తెచ్చుకొన్నాడు. "స్వామీ! మా అందరికీ మీరు ఆరాధ్య దైవం. మేమందరం నిరంతరం మిమ్మల్నే ధ్యానిస్తుంటాం. మరి మీరెవరిని ధ్యానిస్తారు? ఇది ఒక సందేహం. ఇక - వేదాలు, శాస్త్రాలు సర్వులకు ప్రామాణికాలంటారు. వాటిలో చెప్పబడిన వాటిని అనుసరించే మానవులు నడవాలి. కానీ శాస్త్రాలన్నీ ఒకే తీరుగా ధర్మోపదేశం చేయటం లేదు. దేనికదే ఒక మార్గాన్ని సూచించి తనదే సత్యమనీ, నిత్యమనీ ఖండితంగా చెప్తున్నది. అద్వైతం, ద్వైతం, సాంఖ్యం, తర్కం - దేనికదే విడిగా మార్గాలు సూచిస్తున్నవి. మాబోటి వాళ్లం దేన్ని అనుసరించాలి? అన్నీ ఒకటే అనుకోవడానికి పరస్పర వైరుధ్యాలు ఎన్నో కన్పిస్తాయి. ఎలా ఉత్తమ పథం ఎన్నుకోవటం? స్వామీ, మీరు ఆచారాలేమీ పాటించరు. మరి సర్వాచార ప్రవర్తకుడివి నీవేనని అందరూ అంటారు. మేము ఆచారాలు పాటించాలా, అక్కరలేదా? మానవజీవితంలో ధర్మార్థ కామాల ప్రభావం ఎంతో ఉంటుంది. చివరి పురుషార్థం కోసం తపన మాత్రం ఉ ండదు. మొదటి మూడూ అనుభవించి, అనుభవించి విసిగిపోయాను. ఇక చివరిదైన మోక్షం ప్రసాదించండి స్వామీ!" అన్నాడు కార్తవీర్యార్జునుడు.

"అర్జునా, నీ ప్రశ్నావళిలో ముందుగా శాస్త్రాల పరస్పర విరోధం గురించిన ప్రశ్నకు జవాబు చూద్దాం. ఆ వైరుధ్యం వాటిలో లేదు.

ఉన్నట్లు అగుపిస్తుంది అంతే. అన్ని శాస్త్రాలూ క్రమక్రమంగా అద్వైతంలోనే పర్యవసిస్తాయి. తత్త్వంలోకి రాని శాస్త్రం ఏదీ లేదు. పూర్వం ఒకసారి





దేవేంద్రుడికిలాటి సందేహమే వస్తే బృహస్పతి సప్తోదాహరణి అనే పేరిట ఏడు కథలు చెప్పాడు. వాటివలన ప్రతి శాస్త్రమూ మరోదానితో కలుస్తుందనీ, చివరికన్నీ ఆత్మతత్త్వానికే త్రోవతీస్తాయనీ తెలుసుకున్నాడు ఇంద్రుడు. మోక్షం కావాలని కోరావు. మోక్షం అంటే విముక్తి, విడుదల బద్ధుడైనవాడు గదా విడుదల పొందేది! అసలు ప్రపంచంలో బద్ధుడు, ముక్తుడూ అని యిద్దరు లేరు. కనిపించేదంతా కరిగిపోయేదనీ, అశాశ్వతమనీ మనకు తెలుసు. ఇది బుద్ధిగోచరమయింది. ఇక అనుభూతిలోకి వస్తే నీవు విముక్తుడివే. అంచేత అర్జునా, ఈ సృష్టి మొత్తం ఆత్మపదార్థంలో నుంచీ పుట్టిందే - అంటే మన అజ్ఞానం వలన ఈ జగత్తంతా ఉన్నదనీ, ఉంటుందనీ మనం భ్రమిస్తున్నాం. ఈ భ్రమను తొలగించుకోవాలంటే మనం మనలోపలి (అంతర్)జ్యోతిని చూడ గలగాలి. అలా చూడ్డానికి పరిశుద్ధమైన చిత్తం కావాలి. అలాంటి చిత్తశుద్ధి కావాలంటే తన విధ్యుక్త కర్మలు సవ్యంగా చెయ్యాలి. అందు వలన వచ్చిన ఫలితం అంతా దైవానికే ధారపోయాలి. అలా సర్వసమర్పణ చేసికొన్నవాడికి ఈ లోకభ్రాంతి వదిలిపోతుంది. ఆ భ్రమ వదలగానే వైరాగ్యం కలుగుతుంది. వైరాగ్యం కలగగానే మోక్షం వచ్చినట్లు కాదు సుమా! నాలుగు వీధుల కూడలిలో నిలబడినట్లనుకో. ఇక అప్పుడు గురువు అనుగ్రహామృతం గనుక వర్షించిందా - ఆ విరక్తి స్థిరమైపో తుంది. అప్పుడు మొదలవుతుంది తీవ్ర సాధన. సాధన చతుష్టయం అనే పేరుతో ఉన్న నాలుగు రకాల మెట్లనూ ఒక్కటొక్కటిగా ఎక్కుతూ క్రమంగా ధ్యానం, ధారణలవైపు వస్తాడు. అలా నడుస్తూ నడుస్తుండగా అద్వితీయమైన ఆనందపూర్ణస్థితి కలుగుతుంది. అంటే - భగవంతుడు వేరు నీవు వేరు అన్న భావం సమసిపోతుంది.

అర్జునా, ఇందాక నీవు నేనెవరిని ధ్యానిస్తున్నానో అడిగావు. ఇదుగో - యీ ఆత్మపదార్థాన్నే నేను ధ్యానించేది. ఆత్మతత్త్వాన్నే మాటిమాటికీ మననం చేసేది. నాయనా, ఎవరు ధ్యానించినా దానినే. అలా ధ్యానించగా ధ్యానించగా ధ్యేయం, ధ్యాతా ఒకటైపోతారు. అప్పుడిక సృష్టి మొత్తం ఒకే ఆత్మపదార్థంగా కన్పిస్తుంది. అదయ్యా, సంగతి!" దత్తాత్రేయుని వాక్కులు కార్తవీర్యార్జునునిలో ఆనందాన్ని నింపాయి. రవంత భయాన్నీ కలిగించాయి.

**(సశేషం)**

బాలవాణి

## ఇచ్చిపుచ్చుకో

చాలాకాలం క్రితం ఒక రాజ్యాన్ని ఓ రాజుగారు పరిపాలిస్తుండేవారు. ఆ రోజులలో మంచి ప్రభువులు తమ ప్రజల కష్టసుఖాలు తెలుసుకోవటానికి రాజ్యమంతా తిరుగుతూ ఉండేవారు. అలా అయితే స్వయంగా ప్రజలకు, తనకు మధ్యనున్న అధికారుల దురంతాలు తగ్గుతాయని ఆ ప్రభువులు విశ్వసించేవారు.

ఓసారి అలాగే ఆ రాజుగారు మారువేషంలో ఓ పల్లెకు వెళ్ళారు. రాత్రివేళ ఓ వీథి అరుగు మీద కూర్చుంటే అక్కడికి ఓ భిక్షగాడు వచ్చాడు. వాడు ఏమన్నా దానం చెయ్యమని అడిగాడు. "ఇంత అర్ధరాత్రి వేళ కూడా అడుక్కుంటున్నావు. పగలంతా సంపాదించి ఏమి చేసావు?" అన్నారు రాజుగారు - ఊరికే కబుర్లలో పెడదామని. భిక్షకుడు చాలా దీనంగా "ఏం దొరుకుతుంది బాబుగారూ, ఇంత పెద్ద గ్రామంలో నాకు రోజుకు ఒక్కపూట భోజనం దొరకడం కూడా కష్టం అయిపోతున్నది. నాకంటే దరిద్రుడు ఈ ఊరిలో ఇంకొక్కడు వుండడు" అన్నాడు. రాజుకెందుకో అతనికి సహాయం చెయ్యాలనిపించింది. అయినాగాని కొంటెగా నవ్వుతూ, "నువ్వు చెప్పేది బాగానే వుంది. కాని ఎవరి దగ్గరయినా ఏదైనా పుచ్చుకునేటప్పుడు మనం కూడా ఏదైనా ఇవ్వాలి కదా! నువ్వు నాకు ఏమిస్తావో ఇవ్వు" అన్నారు. భిక్షగాడికి ఒళ్ళు మండిపోయింది. ఇతగాడెవరో తన పేదరికాన్ని ఇంతగా అవమానిస్తాడా- అనుకొన్నాడు. వెంటనే తన జోలెలో నుంచి ఒక చిటికెడు బియ్యపుగింజలు తీసి రాజుగారి చేతిలో పెట్టాడు. ఆయన చిరునవ్వుతో వాటిని నోట్లో వేసుకొని భిక్షగాడికి కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు.

రెండు గంటలు గడిచాయి. రాజపరిచారకుడు ఒకడు భిక్షగాడి దగ్గరకు వచ్చాడు. అతని చేతిలో ఒక పెద్ద పాత్ర నిండా బియ్యం ఉన్నాయి. అతడు ఆ పాత్ర భిక్షగాడికిచ్చి "మా ప్రభువుగారు ఇవి మీకు ఇమ్మన్నారు. నీవు ఇచ్చిన చిటికెడు గింజలకు ఇది బదులని చెప్పమన్నారు" అన్నాడు. ఆశ్చర్యంతో

(మిగతా 6వ పేజీలో)





## గర్వ భంగం

- మాతాజీ

(ప్రవేశం-ఒక పండితుడు-తలపాగా, లాల్చీ, ధోవతీ, ఉత్తరీయం-జరీ అంచులది-నుదుట విభూతి - చేతికి బంగారు కడియం)

పం : ఇక్కడి నుంచీ ఎటు వెళ్లాలో! (చుట్టూ చూచి) ఆ! అడుగో - ఆ పశువులు గాచే కుర్రవాడిని అడుగుతాను. (రెండడుగులు వేసి) ఇదుగో అబ్బాయ్- ఓసారి ఇలా వస్తావా?

పశు: నమస్కారం స్వామీ!

పం : నీ పేరేమిటి?

పశు : పైవాడి పాదాలలో పుట్టి, నేలకు జారిన దానిని నెత్తికెక్కించుకున్న పేరేనండి! (కొంచెం కొంటెగా అన్నాడు.)

పం : పై వాడి పాదాలలో పుట్టినదీ నేలకు జారినదీ గంగ - దాన్ని నెత్తిన పెట్టుకోవటం - అంటే నీ పేరు గంగాధరుడా?

పశు : అవునండి.

పం : భలే చమత్కారంగా చెప్పావే!

పశు : ఇంతకీ తమరెవరండీ!

పం : నేనా! నేనో పె....ద్ద పండితుడినోయ్! అనేకమంది పండితులను గెలిచి, ఎన్నో బిరుదులు పొందాను. ప్రస్తుతం కాళిదాసుగారిక్కడ ఉన్నారని తెలిసి, వారితో వాదించి గెలవాలని వస్తున్నాను.

పశు : (తనలో తానే అనుకొంటున్నట్లు) అబ్బో! కాళిదాస మహాకవినే గెలుద్దామని వచ్చావా! (పైకి) సరేగాని స్వామీ, ఎప్పటినుంచో నాకొక్క విషయం తెలుసుకోవాలని ఉంది. ఎవ్వరూ చెప్పలేకపోయారు. తమరైనా చెప్తారా!

పం : ఏమిటో అడగవోయ్! మహామహా పండితులనే గెలిచినవాడిని. నీవంటి పశువుల కాపరి అనుమానం తీర్చలేనా!

పశు : అలా అయితే చెప్పండి - ఆకాశంలోని చుక్కలెన్ని?

పం : ఇదేం ప్రశ్న! లెక్కపెట్టటం కుదిరే పని కాదులే!

పశు : అయ్యో-యింతేనా మీకు తెలిసింది! నాలాటి వెర్రోడికే తెలుసే కొంత.

పం : తెలుసా! అయితే చెప్పు.

పశు :(వంగి గుప్పిటి నిండా ఇసుక తీసుకున్నాడు)-ఇదుగోండి యీ యిసుకలో ఎన్ని రేణువులున్నాయో-సరిగ్గా అన్ని చుక్కలుంటాయి పైన. కావాలంటే లెక్కబెట్టి చూచుకోండి.

పం : (తనలో) వీడెక్కడో ఉద్దండ పిండంలాగున్నాడే! (పైకి) సరేగానీ అబ్బాయ్, ఊరెంత దూరంలో ఉందీ?

పశు :అయ్యా, నా వయసు పదేళ్లు. ఆ ఆవు ఈనడానికి సిద్ధంగా ఉంది. సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఊరు ఎంత దూరంలో ఉంటుందో మీరే చెప్పండి.

పం : ఓరి నీ ..... అసాధ్యుడివే! ఈనమోపైన ఆవుని తొందరగా యిల్లు చేర్చాలి- చీకటి పడుతుందేమోనన్న భయం నీకు కలగటం లేదు - నీవు చిన్నవాడివే అయినా తొందరపడటం లేదు-అంటే ఊరు బాగా దగ్గర్లోనే ఉందన్నమాట!

పశు :పండితుల వారు బాగానే గ్రహించారు. అయ్యా, మరి సెలవండి - వెళ్లొస్తానండి.

పం : సరే, మంచిదిరా అబ్బాయ్! - ఇదుగో కాస్త ఆ చెరువులో కాళ్లూ ముఖం కడుక్కొని నేను కూడా నీ వెనకే వస్తాలే పద!

పశు :హేయ్ నందినీ, సురభీ, శ్వేతా, కాళీ, కపిలా ....... రండమ్మా, రండి - ఇంటికి వెళ్లిపోదాం రండి ...... టుర్ర్.....హేయ్

✶ ✶ ✶

పం : ఓహో! ఊరు పెద్దదే! అదుగో ఎవరో పిల్ల ఎదురువస్తోంది. ఈ పిల్లని కదిలించి చూద్దాం - ఈమె తెలివితేటలెలా ఉంటాయో! (కొంచెం ముందుకు నడిచి)

ఆగు పాపా ఆగు

పాప : ఏమి స్వామీ ఏమి?

పం : పాపా, నీ పేరేమి? కాత్వం బాలే?

పాప : కాంచనమాలే గదా! కాంచనమాలా

పం : ఎవరి పాపవు నీవూ? కస్యాః పుత్రీ?

పాప : కనకలత నెరగవూ? కనకల తాయాః





పం : నీ చేతిలో దేమి? హస్తే కింతే

పాప : పలక గాక మరేమి? తాళీ పత్రమ్

పం : ఏమి వ్రాస్తున్నావు? కావా లిఖసి?

పాప : కఖగఘ - ఆపై రావు కాఖాగాఘ

పం : (దిమ్మ తిరిగిపోయింది.) అబ్బో! వేలెడుందో లేదో - ఎంత చమత్కారంగా- నేను ఏ ఛందంలో అడిగితే ఆ తీరులోనే చెప్పిందే! ఈ ఊరి నీళ్లలోనే కాస్త ఘాటున్నట్లున్నది. సరే - ఈ పూటకిక్కడ-యీ అరుగు మీద విశ్రాంతి తీసుకుందాం.

(కూర్చోగానే లోపలి నుండి ఒక వ్యక్తి వచ్చి నమస్కరించాడు.÷

వ్యక్తి : అయ్యా, తమరెవరు?

పం : నేనొక బాటసారిని. ఈ రాత్రికి ఇక్కడ పడుకొని, ప్రొద్దున్నే వెళ్లిపోతాను.

పెద్ద : అయ్యో, ఎంత మాటండీ! ఈ అరుగు మీద ఏం ఖర్మ లోపలే విశ్రాంతి తీసుకుందురుగాని. ముందు స్నానం చేసి భోజనం అయ్యాక-పడుకోవచ్చు. లేవండి.

పం : అబ్బే! అవేమీ అక్కరలేదండి. కాస్త మంచి తీర్థం యిస్తే చాలు.

పెద్ద : అదేం మాటండి! తమను చూస్తేనే తెలుస్తున్నది ఎవరో గొప్ప పండితులని. మీ వంటివారికి ఆతిథ్యం యివ్వటం మా అదృష్టం. లేవండి-భోజనాదికాలు కానిద్దాం.

పం : సరే అయితే పదండి. (వెళ్లారు)

(లైట్స్ ఆఫ్ అండ్ ఆన్)

(తిరిగి అదే అరుగు మీద పండితుడు-బద్ధకంగా ఆవులిస్తున్నాడు)

(ఒక ఆడపిల్ల ఖాళీ బిందెతో వచ్చింది బయటికి)

అ :నమస్కారం అయ్యగారూ, రాత్రి బాగా నిద్రపట్టిందా?

పం : ఆఁ! ఆఁ!........ హాయిగా నిద్రపట్టిందమ్మా!

(పిల్లవాడొకడు ఇంట్లోంచీ పరుగెత్తుకు వచ్చాడు)

(అక్క చెంగు పట్టుకొని లాగుతూ -÷

బాబు : అక్కా, అక్కా, కాకి 'కావ్ కావ్' అని అరుస్తోంది - ఎందుకే?

అమ్మాయి : అంత పెద్ద పండితులు ఎదురుగా ఉంటే నన్నడుగుతావేరా! ఇదుగో-

నేను మంచినీళ్లు తేవడానికి వెడుతున్నాను. వెళ్లి, వారి నడుగు (వెళ్లిపోయింది)

బా :అయ్యవారూ, అయ్యవారూ! మీరైనా చెప్పరూ! కాకి కావ్ కావ్‌మని ఎందుకంటుందీ?

పం : (ఏం చెప్పాలో తోచలేదు.) ఎందుకేముందీ! భగవంతుడు ఒక్కో ప్రాణికీ ఒక్కో మాదిరి కేక పెడతాడు. పిల్లి “మ్యావ్” అంటుంది. కుక్క భౌ భౌమంటుంది. ఆవు ‘అంబా’ అంటుంది. అలాగే కాకి కావ్‌కావ్ మంటుంది. అది అంతే.

బా :(పిల్లవాడికి నచ్చలేదు.) అంతకన్నా ఏం లేదా?

పం : ఊహూ! ఏమీ లేదు నాయనా!

(అక్క నిండు బిందెతో వచ్చి లోపలికి వెడుతోంది)

బా :అక్కా అక్కా, పండితుల వారు ‘అదంతే’ అంటున్నారు. నువ్వే చెప్పవే!

అ : నీ మొహం -నువ్వు సరిగ్గా అడిగి ఉండవు. సరే, విను. ప్రొద్దున్నే సూర్యుడు వస్తాడు. ఆయన నల్లని చీకట్లను చీల్చుకుంటూ వస్తాడు గదా! కాకులు కూడా నల్లగానే ఉంటాయిగా మరి! తాము కూడా చీకటే అనుకొని చీలుస్తాడేమోనని వాటికి భయం. అందుకని మేము చీకట్లం కాము, కాము కాకులం. “వయం కాకాః, కాకాః”, అని అరుస్తున్నాయి రా!

బా :ఓహ్హో! అలాగా!

పం : రసవత్తరంగా చెప్పావమ్మాయీ!

బా : మరేం నాన్న గారూ ...

తండ్రీ : (బయటినుంచీ వచ్చాడు) ఆఁ! నాకు అంతా వినపడింది. నీవు చెప్పింది బాగానే ఉంది. కానీ అసలు కథ అది కాదే అమ్మాయ్!

బాబు : మరేమిటో నువ్వు చెప్ప నాన్నా!

తండ్రి : ఏం లేదు బాబూ! (దగ్గరకు తీసుకున్నాడు) నీకు చాలా యిష్టమైన వస్తువులేమిటో చెప్ప.

బాబు : ఊఁ!........... నా గోళీలు, పలక, బొంగరం, రంగుల పుస్తకం - ఇంకా మొన్న నువ్వు కొనిచ్చిన బండి బొమ్మ, అమ్మ కొన్న ఉంగరం .......

తండ్రి : ఇవన్నీ నీకు ఇష్టం గదా! మరి అవన్నీ - ఇంకా చాలా వస్తువులు నీకు





ఇచ్చేస్తాము. అమ్మ, నేను లేకుండా నువ్వు వాటితో ఆడుకొంటూ ఉంటావా?

బాబు : అమ్మ, నువ్వూ ఏమవుతారు?

తండ్రి : ఊరికి వెడతాం.

బాబు : అమ్మో! (గుండె మీద చెయ్యి పెట్టుకొని) నాకు బొమ్మలేం వద్దు. మీరే కావాలి. (గభాల్న తండ్రికి హత్తుకుపోయాడు.)

తండ్రి : చూచావా - నీకున్నపాటి తెలివి కూడా పెద్దవాళ్లకు లేదురా! మేమందరం మాకున్న ఇళ్లు, వాకిళ్లు, పొలాలు, బంగారం, చుట్టాలు యివన్నీ చూచుకొని పొంగిపోతుంటాం. ఇవన్నీ యిచ్చిన దేవుణ్ణి మర్చిపోతుంటాం. ఈ కాకులు మనకు ఆ విషయం గుర్తు చేస్తుంటాయి. ఈ సంపదలు, ఈ పేరు ప్రతిష్ఠలు నిలిచి ఉండేవి కావు. తోడు వచ్చేవి ‘కావు కావు’ అని మళ్లీమళ్లీ చెప్తుంటాయమ్మా!

ముసలమ్మ : (లోపలి నుంచీ వచ్చింది - ముసుగుతో తెల్లచీర, విభూతి పట్టె) బాగున్నదిరా అబ్బాయ్! కానీ, యిందులో యింకా లోతుందిరా!

తండ్రి : ఏమిటమ్మా అది?

బాబు : చెప్ప నాన్నమ్మా చెప్ప.

అమ్మాయి : (పండితునితో) మా నాన్నమ్మగారండీ!

పండి : అలాగా! చెప్పండి తల్లీ ఆ లోతు విషయం. ఏమిటో!

ముసలమ్మ : మీ వంటి పండితుల ముందు నేను చెప్పేదేముంది బాబూ! అయినా అడిగారు గనుక చెప్తాను. మనందరికీ యీ ప్రపంచంలోని వస్తువులన్నీ శాశ్వతాలు కావు-కావు అని తెలుసు. అయినా వాటిని వదలం. కాకులు ‘ఓ స్వామీ, ఇవి నిత్యం కావని తెలిసినా-వీటినే పుచ్చుకు వేళ్లాడుతున్నాము. ఈ అజ్ఞానం నుంచీ మమ్మల్ని రక్షించు తండ్రీ రక్షించు. “కావు తండ్రీ కావు”-అంటూ నిత్యం ప్రార్థిస్తుంటాయయ్యా!

పం : ఓహ్హో చాలా బాగున్నదమ్మా! (అందరూ చప్పట్లు కొట్టారు.)

పం : ఈ ఊళ్లో గొడ్ల కాసుకొనేవారు, పసిపిల్లలు, వృద్ధులు, స్త్రీలు- అందరూ ఇంత తెలివిగల వారైతే ఇక్కడి పండితుడు కాళిదాసును నేనేం గెలుస్తాను! అయ్యా, సెలవు, వెళ్లొస్తాను. నమస్కారం.

(వెళ్లిపోతాడు)

# My Pet Puppy

- Bala Mithra

Eight-year-old Rahul was travelling with his father in a car when, at the outskirts of the town, they saw a farm house where a board announced, 'Puppies for Sale'. It attracted Rahul's attention. He requested his father to stop the car to see the puppies.

They stopped and came near the fence of the farm house. The farmer came out and asked if they wanted to see the puppies. Rahul said, 'Yes'. The farmer opened the door of a kennel and out popped four smart puppies and started running hither and thither. The armer opened another kennel and little puppy limped out. Rahul seemed to be more interested in that puppy. He asked the farmer to bring it to him. He fondled the puppy and said, "I like this puppy. I will buy it".

The farmer was wondering why Rahul chose the lame dog when so many other active little ones were available and he could play with any of them. He asked, "That is a lame dog. Do you not like the other four?"

Rahul replied, "See, I am also a lame boy. I cannot be running around with the puppies. But this dog is like me. He walks about only at my speed. He will be ideal company for me".

There were tears in the farmer's eyes. He did not want to get any money from Rahul. He said, "Take it. It is my gift to you. I understand your love for it".

The little boy picked up the puppy, fondled it and limped away with his proud possession after thanking the former.

★





# జెంటిల్‌మన్ అంటే

వివేకానందుడు మొదటి పర్యాయము విదేశాలకు వెళ్లినప్పుడు ఆయనకు స్వాగతం పలకటానికి అక్కడ ఎవరూ లేరు. నఖశిఖ పర్యంతం ఆయన కాషాయ వస్త్రాలు ధరించి వున్నాడు. శిరస్సుపై తల పాగా ధరించాడు. త్రోవలో వెడుతుండగా ఆయనను ఒక విదేశీ దంపతులు చూచారు. భార్య భర్తతో వ్యంగ్యంగా అన్నది - అటు చూడండి 'జెంటిల్‌మన్ వస్తున్నాడు'. విదేశాలలో ప్యాంటు, షర్టు ధరించే వారిని జెంటిల్‌మెన్ అంటారు. వివేకానందుని విచిత్ర వేషాన్ని చూచి ఆ స్త్రీ ఎగతాళి చేసిందన్న మాట. వివేకానందునివి పాము చెవులు. ఆయన ఈ మాట విన్నాడు. వెంటనే ఆగిపోయాడు. ఆ దంపతులు తన సమీపానికి రాగానే వివేకానందుడు ఇలా అన్నాడు - "సోదరీ! నేనిప్పుడు మీ ప్రక్కనుండి వెళుతుండగా ఈ జెంటిల్‌మన్‌ను చూడు. అని అన్నావు కదా!" ఆమె "అవును విచిత్రమైన వేషం చూచి అలా తమాషాగా అన్నాను" అన్నది. వివేకానందుడు చెప్పాడు.- "మీరిలా అన్నందుకు నేనేమీ అనుకోవడం లేదు. నాకేమీ బాధ లేదు. కానీ ఈ శబ్దం పట్ల మా దృష్టి ఏమిటో మీకు విశదపరుస్తున్నాను. సోదరీ! మీ దేశంలో జెంటిల్‌మన్‌ను దర్జీ తయారుచేస్తాడు. మా దేశంలో జెంటిల్‌మన్‌ను ఋషులు తయారుచేస్తారు. ఎవరో ఒక మహాత్ముని ఆధ్యాత్మిక స్పర్శ మాత్రం చేత ఇలా జరుగుతుంది. మీ దేశంలో మనుషులు దర్జీ కుట్టిన ఫ్యాషనబుల్ దుస్తులు ధరించి బయట తిరుగుతుంటారు. హృదయంలో ఎటువంటివాడు అయినా కావచ్చు. అతడు జెంటిల్‌మన్ క్రిందనే పరిగణింపబడతాడు. మా దేశంలో మనిషి ఎటువంటి దుస్తులు ధరించినా అతడు సత్సంస్కారాలు కలిగినవాడు అయివుంటే జెంటిల్‌మన్. ఈ శబ్దానికున్న నిర్వచనంలో మీకు, మాకు ఇంతటి అంతరం ఉంది". ఇంకేముంది! ఆ దంపతులు వివేకానందునికి శిష్యులైపోయారు. ఆయనను తమ ఇంటికి ఆహ్వానించారు. భారతీయ సంస్కృతిలోని విశేషం ఇది.

◎

# శరణం ప్రపద్యే

– సేకరణ : స్వర్గీయ శ్రీ జి. వేంకట్రావుగారు

1. సాయీ, సాయీ, సాయీ,
సాయీ యని పల్కు వారి సంతాపములన్
సాయీశ్వరఁ ద్రోలెదవని
వేయి విధంబుల స్తుతింతు విమలుడ సాయీ!
2. నన్ను దలంచెడు వారిని
సన్నుతముగఁ గాతునంచు స్వామీ, నీవా
పన్నులగు భక్త వరులకు
మున్నుగ నుడివితివటయ్య ముదమున సాయీ!
3. ఎటువంటి బాధలైనను
తటుకున బోద్రోలునట్టి ధన్యుడవీవే
కుటిలుడనని మదినెంచక
చటుకున్న బ్రోవంగవలయు సద్గురు సాయీ!
4. నీదగు విభూతి గైకొని
ఏదీనత్వంబు లేక యిలను జనంబుల్
మోదమును గాంచుచుందురు
ఆదిత్య సమప్రకాశ, అమలుడ సాయీ!
5. నీ భజనము సత్సంగము
నీ భక్తుల ఆర్తులకు ప్రేమ సేవ నిర్మల చరితము
ఏ భవనంబున గలవో
ఆ భవనము కీర్తి తోడ శాశ్వతముగ నలరును సాయీ!
6. జననివి జనకుడవీవే
ఘనుడగు గురుమూర్తి వీవే, కావగ రావే!
మనమున శ్రద్ధను నింపుచు
అనవరతము బ్రోవుమయ్య అవనిని సాయీ!





# అవసరం-ఆశ

– 'భరాగో' గారి 'ఆరామగోపాలం' నుండి

బి.ఏ. ఫైనల్ ఇయర్ పరీక్ష ఫీజు 55 రూపాయలు కదా. బత్తుల వజ్రంగారు ఇచ్చిన ఐదు రూపాయలు కాక, నాన్నగారు 15-12-1950 లోపుగా పోగు చేసినది 30 రూపాయల వరకు ఉంది.

మా కుటుంబపు ఆర్థిక దుస్థితి బాగా తెలిసిన వారిలో అవసరాల రామకృష్ణారావుగారి చిన్నక్క (బచ్చు నరసింహస్వామిగారి ఇల్లాలు కమలగారు) ఒకరు. వారిది ఒకనాడు చాలా ధనిక కుటుంబము. కాని, నాకు పరిచయం అయినప్పటికి (1949) అది "కొడిగట్టిన దీపం".

అయినా సరే, ఆవిడ తన కంటే చిన్నవాళ్లను ఎంతో కరుణతో చూశారు. రామకృష్ణారావు రెండేళ్ల బి.ఎస్సి. చదవడానికి కాకినాడ పి.ఆర్.కాలేజీ నుండి విజయనగరం వచ్చి, మొదటి ఏడాది వారింట్లోనే ఉండేవాడు. తరువాత సంవత్సరం (1950-51) కోడుగంటి వారి వీధిలో ఒక ఇంట్లో చిన్నగది అద్దెకు తీసుకొని చదువుకుంటూ, భోజనానికి మాత్రం చిన్నక్కగారి ఇంటికి వెళు ండేవాడు.

ఖాళీ దొరికినప్పడల్లా (ముఖ్యంగా సాయంకాలాలప్పడు) లంక వీధిలో పి.ఏ. క్వార్టర్స్‌లో ఉండే చిన్నక్కగారిని, బావగారు నరసింహ స్వామిగారిని పలకరించి ఎవరిదారిన వారు వెళ్లిపోయేవారము. ఎప్పడు వెళ్లినా చిన్నక్కగారు మాకు తినడానికి ఏదో ఒకటి పెట్టేవారు. నా పరిస్థితి పట్ల జాలి, నా విద్యాకాంక్ష పట్ల సానుభూతి, ఆవిడకు గాఢంగా ఉండేవి.

ఎమ్.రామకోటిగారు, రామకృష్ణారావుగారు, నేను చాలామందికి కలిసి కనపడేవాళ్లం. మాకు "రామత్రయం" అనే వ్యంగ్యనామం ఉండేది. మా ముగ్గురిలో వయస్సు చేత మాత్రమేకాక, సాహిత్య వాఙ్మయ పరిజ్ఞానంలో కూడా

రామకోటిగారే పెద్ద.

అలా సాగిన రెండేళ్ళ స్నేహంలోంచి, చిన్నక్కగారి కరుణలోంచి ఒక ఆపద్బాంధవ సదాలోచన జనించి ఉండాలి.

ఆ రోజు జేబులో 35 రూపాయలతో కాలేజివేపు బయలుదేరాను. బొంకులదిబ్బ దాటి షరాఫ్‌ఖానా వారి వీధి జంక్షన్ వచ్చేసరికి, రామకోటిగారు, రామకృష్ణారావుగారు కలిశారు.

పరీక్షకు కట్టవలసిన ఫీజు 55 రూపాయల్లో మీ దగ్గర ఎంత ఉంది? అని అడగకుండా, రామకోటిగారు రామకృష్ణారావుగారితో "ఇయ్యి" అన్నాడు. రామకృష్ణారావు జేబులోంచి ఫెళఫెళలాడే పది రూపాయల నోట్లు అయిదు తీసి నా చేతిలో పెట్టేడు. నేను వాటిని పుచ్చుకొన్నానేగాని, అప్పటికి నా దగ్గర 35 రూపాయలు ఉన్నాయి కనుక, రెండు కాగితాలే తీసుకొని, మిగిలిన మూడూ అతనికిచ్చేశాను.

నేను ఆ రోజు తీసుకున్న 20 రూపాయలు చిన్నక్కగారు పంపేరో, రామకోటిగారే సమకూర్చారో, రామకృష్ణారావే ఇచ్చేడో, ఈ యాభై ఏళ్ళుగా నేను తెలుసుకోలేకపోయాను.

నా స్నేహితులలో ఇతరులు మాత్రం వారు 50 రూపాయలు నాకు ఇవ్వటం పట్ల ఎంత ఆనందం పొందారో, నేను 30 రూపాయలు వెనక్కి ఇచ్చేయటం పట్ల అంతకంటే ఎక్కువ ఆశ్చర్యాన్ని ప్రకటించారు.

మా నాన్నగారు అప్పడప్పడు నాతో ఆపేక్షగా వచిస్తూ ఉండిన వాక్యాలలో ఈ సంఘటనకి అనుగుణమైనది ఒకటి ఉంది. "మానవుడికి అవసరాలుంటాయి. ఆశలు కూడా ఉంటాయి. అవసరానికీ, ఆశకీ మధ్య ఒక గీత గీసుకోవాలి. ఎవడైనా అవసరమనే భాగం నుండి ఆశ అనే భాగంలోకి వెళ్లాలనుకుంటే వాడికి మెప్ప ఉండదు. మోక్షం అసలే ఉండదు".





# పుట్టిన దినము పండుగ

– "మరో జంఘాల శాస్త్రి" నుండి (అ॥సో॥ నాగేశ్వరరావు)

జంఘాల శాస్త్రి ఇట్లుపన్యసించెను.

"నాయనలారా, ఈ మధ్య నా మిత్రుడొకడు తన కుమారుని పుట్టిన దినమునకు తన గృహమునకు రమ్మని ఆహ్వానించగా పోయితిని. ఇల్లంతయు రంగురంగుల కాగితములతోను, విద్యుద్దీపములతోను, గాలిబుడగలతోను అలంకరింపబడినది. హాలులో ఒక పెద్ద బల్ల వేయబడినది. దానిపైన కుర్రవాని వయస్సును తెలియజేయుచు ఐదు కొవ్వొత్తులుంచబడినవి. ఆ ప్రక్కనొక చాకు.

నా మిత్రుడు ఆదాలోనూ, హోదాలోనూ కూడా పెద్దవాడు. గనుక చాలామంది మిత్రులు విచ్చేసినారు. గతంలో నేను తమ వేషధారణ మును విమర్శించితినని కాబోలు - నన్ను చూడగానే మూతులు ముడుచుకొని, ముసిముసి నగవులు చిలకరించుకొనుచున్నారు. కొందరు నవనవోన్మేష వస్త్రాలంకరణ శోభితులైన పురుషులు కావి రంగు పంచె, అదే రంగు చొక్కా, గోష్పాదమంత జుట్టు ఉన్న నన్ను జంతు ప్రదర్శనశాలలోని వింతజంతువును చూచినట్లు చూచి వారి కబుర్లలో వారు పడినారు. కొద్దిమంది మాత్రము నన్ను గుర్తించి నమస్కరించి, సాక్షి సంఘము గూర్చియు, సాక్షి ఆరోగ్యమును గూర్చియు అడిగి తెలిసికొనిరి.

మిత్రులందరు వచ్చిన తరువాత కార్యక్రమము ఆరంభమైనది. పుట్టినరోజు కేకుపై వెలిగించబడిన క్రొవ్వొత్తి దీపముల నా బాలుడు నోటితో ఊది ఆర్పివైచినాడఖు. అటుపై కేకును ప్రక్కనున్న కత్తితో తండ్రి సాయమున ముక్కలు చేసెను. ఇంతలో నొక్క కేక వినబడినది. అంతవరకు ఏదియో ఆలోచించుకొనుచున్న నేను ఆ కేకకు త్రుళ్లిపడి, ఇంతలో ఏమైనదని గాభరా చెందితిని. కాని, నాయనలారా, అక్కడ చేరిన స్త్రీ, పురుషులందరును "హ్యాపీ బర్త్ డే టూ యూ" అని పాడు చుండిరి. ఆ శబ్దమున కదిరిపడిన ఆ కుర్రవాని

ఏడుపు కూడ అందులో కలిసిపోయినది. ఉపాహార సేవానంతరము నా మిత్రుడు నన్ను తన మిత్రులకు పరిచయము చేసి, ఏదేని ఒక్క విషయమును గూర్చి నన్నుపన్యసించవలసినదిగా కోరెను. రోగి కోరినదీ, వైద్యుడిచ్చినదీ ఒకటే ఐనట్లయినది. నేనిట్లు ప్రసంగించితిని.

"పుట్టినరోజును గూర్చి ప్రసంగించమని కోరితిరి గదా! నాయనలారా, ఇది పుట్టినదినపు వేడుకయా! హరహరా, మహదేవా, పరమశివా, నేను కలగాంచుట లేదు గదా! నేనున్నది లండను నగరము కాదు గదా! లేదు నాయనలారా, లేదు. నేనున్నది అచ్చ మయిన తెలుగువారి రాజధాని. మరి - ఇదేమి విపరీతము! ఈ దీపములార్పుట ఏమి! ఈ రొట్టె ముక్కల కత్తిరింపులేమి! ఈ సామూహిక బృందగానములేమి! నాయనలారా, మనకు సంప్రదాయములు లేవా! ఆచార వ్యవహారములు లేవా? మన జాతి అంత గొడ్డు వోయినదా? అంత నిస్తేజమైనదా? అంత నిర్వీర్యమైనదా? మీ సూటు బూటులనే కాక ఆచార వ్యవహారములు కూడ దిగుమతి చేసుకొనుచున్నారా? అయ్యయ్యో! ఈ దేశమునకు స్వాతంత్ర్యము వచ్చి అరువదేండ్లు దాటిపోయెనే! ఏదీ, భావ స్వాతంత్ర్యమేదీ? రాజకీయ దాస్యము తొలగినదేగాని భావదాస్యము పోలేదే!

నాయనలారా, ఏదైన శుభకార్యము జరుగుచున్నపుడు జ్యోతిని ప్రజ్వలించుట మన ఆచారము గదా! అంతియెకాని దీపముల నార్పుట సంప్రదాయమా? అంధకారము నాహ్వానించుట సంప్రదాయమా? కొంపలు కూల్చుట సంప్రదాయమా? ఇందుకై ఇంటిలో పీనుగ పోయినట్లు మీరందరును గొల్లుమని ఆంగ్లములో కోరస్సులా! కేకులు ఫలహారములా? సూర్యాస్తమయ పూర్వము కుర్రవానికి హారతిచ్చి, మంగళగీతములు పాడి, స్త్రీలకు పసుపు, కుంకుమలను, పురుషులకు తాంబూలములను ఇచ్చి సత్కరించెడి సంప్రదాయము చెడిపోయినదా?

ఇది చాలక - మన తెలుగులో పదములు కొరవడినట్లు - మీ పిల్లల చేత మమ్మీ, డాడీ అని పిలిపించుకొని మురిసిపోవుచున్నారా? మన భాషలో అమ్మ, నాన్న పదములుండగా మనకీ మమ్మీ, డాడీలెందుకు? అమ్మ వంటి





కమ్మని మాట వేరేదయిన కలదా? మమ్మీ అను పదమునకర్థము తెలియునా? స్తన్యమునిచ్చి పిల్లలను పెంచు జంతుజాలమును జంతుశాస్త్రములో మేమల్సందురు. అందుండి ఉద్భవించినదే యీ మమ్మీ పదము. మీ పిల్లల చేత జంతువులుగా పిలిపించుకొని మురిసిపోవుచున్నారా!

నాయనలారా, ఇట్టి వెర్రివెయ్రి పోకడలకు పోయి మన సత్సంప్రదాయములను నాశనము చేయకుడు. ఇప్పటికైనను భావదాస్యము వీడుడు. అది వీడినగాని జాతికి మోక్షము లేదని గ్రహింపుడు. మీ పిల్లల చేత అమ్మ, నాన్న అని పిలిపించుకొనుడు. వారిని చక్కని ఆదర్శవంతమైన పౌరులుగ తీర్చిదిద్దుడు. భారత జాతికి కీర్తినార్జింపుడు. ఇది అదును కాకపోయినను ఇంతసేపు ప్రసంగించినందులకు మన్నింపుడు. సెలవు".

❄

---

## జైలు అనుభవాలు

**(32వ పేజీ తరువాయి)**

అనుమానితులపై లాఠీఛార్జీ సాగించారు. ఏడుపులూ, పెడబొబ్బలూ వినపడుతున్నా మమ్మల్ని కూడా లాకప్పులో ఉంచిన కారణంగా తెల్లవారిందాకా అసలు ఏం జరిగిందో మాకు తెలియరాలేదు.

అప్పట్లో మలబార్ జిల్లాకు ఇ.సి.ఉడ్స్ జిల్లా కలెక్టరు. ఆయన జైలును పరిశీలస్తూ నా గదికి వచ్చాడు. నా గది నిండా పుస్తకాలు, తెల్లకాగితాలు, వ్రాత సామగ్రి ఉన్నాయి. ఆయనకు ఒక ఖైదీ బండెడు పుస్తకాలు ముందు వేసుకొని కూర్చొని తీరికగా వ్రాసుకోవటం నచ్చలేదు. 'ఏం వ్రాస్తున్నావ'ని అడిగాడు. ప్రపంచ ఆర్థికవిధానం గురించీ, బర్మా సిలోన్ వంటి దేశాలలో నా పర్యటనానుభవాలను గూర్చీ వ్రాస్తున్నానని చెప్పాను. ఆయనప్పుడు నన్ను గుర్తించాడు. తాను గంజాం జిల్లాలో నేను ఆయన ఎదుట ఒక కేసులో హాజరైన ఉదంతం గుర్తుచేసుకున్నాడు. ఆపైన నేను రెవిన్యూ మంత్రిగా ఉన్నపుడు ఇదే ఉడ్స్ దొర నా క్రింద ఒక జిల్లా కలెక్టరుగా పనిచేసాడు. అదో కథ.

★

# కంఠస్థ యోగ్య పద్యాలు

శ్రీ మదాంధ్ర మహాభాగవతం ఒక అనర్ఘ మణిమాల. రసార్ద్రత, భక్తి భావ నిర్భరత, శబ్దాలంకార సోయగాలు నిండిన కవిత పోతన్న గారి సొంతాలు. సాధారణంగా భాగవతం అనగానే రుక్మిణీ కళ్యాణం, గజేంద్ర మోక్షం, ప్రహ్లాద చరిత్ర, వామనావతారం, క్షీర సాగరమథనం, కృష్ణలీలలు, భ్రమర గీతలు - యిలా ఏవో కొన్ని ఘట్టాలే స్ఫురిస్తాయి. కానీ వివరంగా చదువుతూ వెడితే ప్రతి మూలా ఏదో ఒక అద్భుతమైన పద్య రత్నం లభిస్తూనే ఉంటుంది. కృష్ణ లీలల వంటి ఉలిపి బాల్య చేష్టల మధ్య ఎలాంటి పద్యం ఉందో చూద్దాం.

బుజ్జి కృష్ణుడి అల్లరి మితిమీరిపోయింది. అమ్మ యశోదమ్మకు బాధ, కోపం, ఆశ్చర్యం - అన్నీ కలగలిపి వచ్చాయి. వీడికి మరీ భయం లేకుండా పోయింది" అనుకొన్నది.

"లాలనమున బహు దోషములోలిం బ్రాపించు, తాడనోపాయములం

జాల గుణంబులు గలుగును, బాలురకును తాడనంబ పథ్యం బరయన్"-

అనుకొన్నదట. కొడదామన్న ఓ పట్టాన దొరుకుతాడా కొంటె కన్నయ్య! పరుగెత్తి పట్టుకొని, ఆ అలసటలో ఒళ్లు మండిపోయి ఓ రోటికి వేసి కట్టేసింది - ఆ జగదేక వ్యాపిని. ఆ స్వామి లోలోన నవ్వుకొంటూ కట్టించుకొన్నాడు త్రాటితో (ఉదరాన దామంతో కట్టింది తల్లి. అందుచేతనే దామోదరుడన్న పేరు సార్థకమైనదని వ్యాఖ్య కూడా ఉన్నది.) సరే - కృష్ణుడు తనను కట్టిన ఆ రోలు ఈడ్చుకొంటూ వెళ్లి, తమ పెరటిలో ఉన్న రెండు మద్ది చెట్ల మధ్యగా వెళ్లాడు. కృష్ణ పాద స్పర్శతో ఆ మద్దిచెట్లు విరిగి పడిపోయాయి. వెంటనే ఆ స్థానంలో ఇద్దరు గంధర్వులు ప్రత్యక్షమైనారు. వారు నలకూబరుడు, మణిగ్రీవుడూను. కుబేరుని కొడుకులు గనుక, ధనమదాంధతతోపాటు ఒంటి మదం కూడా





పెరిగి - ఎదురుగా గురుజనులు వస్తున్నా లెక్కచేయని రీతిలో - స్త్రీ లోలతతో వికృతంగా సంచరిస్తుండటంతో నారదునికి కోపం వచ్చింది. వీళ్ల మదోన్మత్తతకు తగిన శాస్తి చేయాలనుకున్నాడు. "మీరు అర్జున తరువులై జన్మించండి. నూరు దివ్య సంవత్సరాల తరువాత గోవింద చరణారవింద స్పర్శతో మీకు తిరిగి మీ రూపాలు వస్తాయి'' అని శాపమూ, విమోచన మార్గమూ కూడా ప్రసాదించాడు.

"అప్పటినుండీ మేమిక్కడ వృక్షాలమై పడి ఉన్నాం స్వామీ! ఇప్పటికి నీ కరుణ మాపై ప్రసరించింది. సర్వజీవులకూ రక్షకుడవు నీవే. స్వామీ, నీ చరణాల తాకిడి మా లోపలి అహంకారం నశించింది. ఇకపై మాకొక్క వరమివ్వవయ్యా! మా చెవులు నీ గురించిన పద్యాలే ఆలకించాలి. మా నాలుక నిన్ను గూర్చిన సంకీర్తనమే చేయాలి. నా చేతులు నీ సేవకే ఉపయోగించాలి. మా దృష్టి నీ మీదనే నిలవాలి. మా శిరస్సులు నీ పాదాలపై ఉండాలి. మా చిత్తం నీ సేవలోనే స్థిరమై నిలవాలి. మా బుద్ధి నీపైనే ప్రసరిస్తుండాలి. అలాటి వరం మా కివ్వు స్వామీ!" అని ప్రార్థించారు ఆ సోదరులు.

మనిషి పతనం చెందవచ్చు. తిరిగి ఔన్నత్యం సాధించే ప్రయత్నం చెయ్యాలి. ఆ ప్రయత్నానికి సహకరించమనీ, ఆ యత్నం సఫలీకృతం చేయడానికి తగిన ఆశీస్సులిమ్మనీ పరమాత్మను ప్రార్థించాలి. అందుకే పద్యం ఎంతగానో ఉపకరిస్తుంది - నేర్చుకొందాం.

"నీ పద్యావళులాలకించు చెవులున్, నిన్నాడు వాక్యంబులున్

నీ పేరంబని చేయు హస్తయుగముల్, నీ మూర్తి పైన చూపులున్,

నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్, నీ సేవ పై చిత్తముల్,

నీ పై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీరేజ పత్రేక్షణా!"

# నిష్కామ కర్మ

– "శ్రీ రమణ కథాసుధ" నుండి

"భగవాన్ నిష్కామ కర్మ అంటే ఏమిటి?" -
అని ఒక పండితుల వారు రమణ మహర్షి ప్రభువును అడిగారు. భగవాన్ మౌనం వహించారు. తరువాత కొంతసేపటికి పండితుడు, కొందరు భక్తులు అనుసరించగా భగవాన్ కొండ మీదికి దారితీశారు.

కొండ మీదికేగుచుగాంచె - కొమ్మనొకటి
దాని ముళ్ళన్ని తొలగించి - తగిన రీతి
ఆకులలములతో దాని - నందముగను
సాపు జేసి మునెంతయో - చక్కగాను
చేతి కర్రగ దానిని - చేసెనపుడు

ఇంతలో ఆ మార్గము వెంట వచ్చు పశువుల కాపరి చేతి కర్ర కోల్పోయి విషాదముగా భగవాన్‌కు ఎదురుగా వచ్చాడు. భగవాన్ చేతిలోని అందమైన కర్రను చూచి ఆశపడి,

"చూడ ముచ్చటగా నుండె - సొగసుగాను
పశువుల తోలుకొనుటకు - పనికి వచ్చు
సామి నా కొసగు మటంచు - చల్లగాను"
అడిగె పశువుల కాపరి - ఆశతోడ.
రెండు గంటలు శ్రమకోర్చి - నిండుగాను
చేసెనద్దానినెంతయో - చెలువు మీర
ఇచ్చివేసెను సామియు - ఇంపుగాను
అదియ రమణ బోధలీల - అద్భుతంబు.
కర్మఫలమునకెపుడును - కాంక్ష పడక
చేయవలెననులెప్పడు - చిత్తమలర
అనెడి నిష్కామ కర్మతా - నా చరణలో
చేసి చూపెగా సామియు - చిన్మయముగ





# జైలు అనుభవాలు

## (ఆగస్టు 15న రానున్న 64వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా యిది చదవండి.)

మొదటిసారిగా నన్ను మద్రాసు పెనిటెన్షరీలో నిర్బంధించారు. ఎండలో తిరిగినందున నా ఒంటి మీద లేచిన కురుపులు తగ్గేవరకూ నన్ను అక్కడి ఆసుపత్రిలో ఉంచారు. అవి మామూలుగా ఎండాకాలంలో ఇంటిపట్టున నీడలో ఉండేవారికి వేడి వలన పుట్టే గడ్డలు కావు. పదిహేను రోజుల పాటు కాలి నడకన ఎండలో వీధులన్నీ తిరిగిన తాపం వల్ల కలిగినవి. మైళ్ల కొద్దీ నడిచి సముద్రానికి వెళ్లి ఉప్పు తయారుచేసాం. అదీ రోజుకొక్క తావున. ఇన్‌స్పెక్టర్ జనరల్‌గారి ఆఫీసు ఎదుట ఇసుకలో, తిరువళిక్కేణి బీచ్‌లో, హైకోర్టు బీచ్‌లో, రాయపురంలో - రోజూ ఒక క్రొత్త తావున ఉప్పు చేయటం. ఆ ఉత్సాహంలో ఎంతో అనుభవం సంపాదించాను. కానీ, నా శరీరానికి కాస్త విశ్రాంతి లభించేటప్పటికి ఆ వేడి అంతా పైకి తన్ని ఒళ్లంతా, తలలో కూడా సెగ్గడ్డలు లేచాయి. విపరీతమైన మంటతో, బాధతో జైల్లో ఉండవలసి వచ్చింది. మశూచికపు బాధలాగా ఉండేదది. జైలు అధికారి మిస్టర్‌హెూ.

కురుపులు తగ్గాక నన్ను జైలు లోపలికి మార్చారు. నాకిచ్చిన గది దుమ్ము, ధూళితో నిండి ఉంది. ఆ గదికి బాత్‌రూం లేదు సరిగదా - చివరికి ఒక 'కరోడ్' అయినా లేదు. అలా ఆ గుహలో రెండు మూడు వారాలపాటు ఉన్నాను. సాయంత్రం 5 గం.లకు లాకప్‌లో పెట్టి ఉదయం 6 గంటలకు బయటకు రానిచ్చేవారు. తరువాత తిరుచిరాపల్లి జైలుకు మార్చారు నన్ను. అక్కడ వార్డర్లు మామూలు ఖైదీలను వారి యిష్టం వచ్చినట్లు బాదేవారు. తప్పు ఉన్నా, లేకపోయినా బాదటం అన్నది అక్కడి వార్డర్లకు అలవాటు. ఒకరోజు ఇనుప ఫెన్సింగుకు దగ్గరగా ఉన్న ఒక ఖైదీని ఒక వార్డరు తన తోలుబెల్టుతో అదే పనిగా బాదటం నా కంటపడ్డది. నేనప్పడు ఇతరులతో కలిసి వరుసలో నిలబడి

ఉన్నాను. పాపం, ఆ ఖైదీ నోరు మూసుకుని ఆ దెబ్బలు భరిస్తున్నాడు. నొప్పికి ఏడుస్తున్నాడు. అయినా వార్డరు బాదటం ఆపలేదు. నేను ముందుకు వెళ్లి 'ఆపు' అని ఒక్కసారి కేక వేసాను. వార్డరు ఆ బెల్టు అక్కడ పారేసి పారిపోయాడు. తరువాత యీ కబురు జైలు సూపరింటెండెంటు కార్నిష్‌కు తెలిసింది. ఆయన వచ్చి మమ్మల్నందరినీ విచారణ చేసి స్వయంగా ఆ కేసు ఫైసలు చేశాడు.

మా 'ఎ' క్లాసు ఖైదీల నుంచిన గదులకు వెనుక వరుసలలో వంట శాలలుండేవి. వంట తెలిసిన ఖైదీలే వంట చేసేవారు. తెల్లవారుజామున 3 గంటల నుండీ ఏవేవో పనులు చేస్తుండేవారు. ఒకరోజు తెల్లవారుజాము 4 గంటలకు హఠాత్తుగా అక్కడి ఖైదీల మీద లాఠీఛార్జీ చేసారు. ఆ ఖైదీల అరుపులు, ఏడ్పులు, లాఠీల చప్పళ్ళు హృదయవిదారకంగా వినపడుతున్నాగానీ-మేమూ ఖైదీలమే గనుక వెళ్లి వాళ్లకు సాయపడే అవకాశం లేక - నిస్సహాయంగా ఉండిపోవలసి వచ్చింది.

మాకు అన్నం ముద్దలు-పిండాలు, రసమూ కొళంబు అని పిలవబడే ఏదో చిక్కని ద్రవపదార్థమూ ఆహారంగా లభించేవి. ఆ ఆహారం ఎటువంటి మానవునికైనా ఆరోగ్యదాయకం కాదు. కొళంబులో వాడవలసిన కూరలూ, పప్పులూ విచిత్రంగా మాయమై, వాటి స్థానంలో ఏదో యింత తుక్కూ, గడ్డీ ఉపయోగింపబడేవి. ఇలాటి కారణాల వల్ల చాలామంది ఖైదీల ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆ అన్నపు ముద్దలో రాళ్లు రప్పలేకాక పురుగులు కూడా ఉండేవి. అలాటివి కనపడినపుడు నిరాహారంగా రామభజన చేసేవాళ్లం. జెయిళ్లన్నవి సృష్టించబడిన నాటి నుండీ ఖైదీలకు చల్ల యివ్వడమన్నది ఆచారంలోనే లేదు.

ఫైల్ పద్ధతి ఒకటి మమ్మల్ని చాలా చికాకు పెట్టేది. వారానికోసారి ఖైదీలందరూ ఒక వరసలో నిలబడాలి. (రకరకాల నేరాలు చేసి వచ్చినవారూ, సత్యాగ్రహ ఖైదీలూ అందరూ ఒకే వరుస) వారిని జైలరు, సూపరింటెండెంటూ సరిగా ఉన్నారో లేదో చెక్ చేసుకోవాలి. ఖైదీలు తమ బరువును చూపించే తూకపుఛార్టులు సరిగా కనిపించేలా పట్టుకుని నిటారుగా నిలబడాలి. ఇదంతా మాకు తలవంపుగా ఉండేది. కానీ సత్యాగ్రహుల మవటం వల్ల సరిపెట్టుకోక





తప్పేది కాదు.

జైల్లో వైద్యసహాయం కూడా అంతంతగానే ఉండేది. ఒక రోజున ఒక సత్యాగ్రహి అయిన యువఖైదీ మరణించాడు. డాక్టరు సరిగా చూడని కారణంగానే ఆ కుర్రవాడు మరణించాడనే వార్త పొక్కింది. అల్లరి ఏదో జరగనుంది. యువకుల హృదయాలలో ఏదో అశాంతి బయలుదేరిందనే వార్త కూడా పొక్కింది. దానితో మేము కాస్త కలుగజేసుకున్నాము. పోయిన కుర్రవాడు ఆంధ్రుడు. వాని జననీ జనకులు ఎక్కడో దూరతీరాలలో ఉన్నారు. అంతదూరం నుంచీ అతని బంధువులు వచ్చేదాకా శవం అలా ఉంచడానికి అవకాశం లేదు. అందుచేత నేనూ, యితర సత్యాగ్రహులమూ కలిసి ఆ శవదహన కాండ, దేశ స్వాతంత్ర్యం పేరు మీదుగా జరిపించాం. చిన్న ఉపన్యాసంలో ఆ యువకుడి త్యాగాన్ని పొగిడి, భారతమాత దుఃఖశాంతికై అతని ప్రాణాలు బలిచేయబడ్డాయనీ, అది మనకు గర్వకారణమనీ, దేశం కోసం ఆత్మార్పణకు అలా అందరం సంసిద్ధులం కావాలనీ ప్రబోధించాం. యువకుల మనసుల్లో కొంత శాంతి నెలకొన్నది.

అంతలో నన్ను కన్ననూరు జైలుకు మార్చారు. ఇక్కడి జైలు ఆవరణలో మంచి కూరగాయ తోటలుండేవి. వాటిని జాగ్రత్తగా పెంచుతుండేవారు. కొందరు యువఖైదీలు ఉదయం 6 గం.లకు జైలు తలుపులు తెరవగానే తోటవైపు పరుగెత్తి ఫెన్సింగ్ మీదుగా దూకి లోపలికి వెళ్లి లేత లేత బెండకాయలు మొదలైనవన్నీ తెగతినేవారు. వార్డర్లు వాళ్లను పట్టుకొంటూ ఉండేవారు.

స్వాతంత్ర్య దినం నాడు తెలతెలవారుతుండగా మేము మా సెల్స్‌లోంచీ బయటకు వచ్చేసరికి ఆఫీసర్లలో పెద్ద కలకలం కనపడ్డది. టవర్ మీదా, ఖైదీలుంటున్న బ్లాక్స్ మీదా కాంగ్రెసు జెండాలు ఎగురవేయబడుతున్నాయన్న గందరగోళం ఎక్కువైంది. దీనిమీద ఎంతో తర్జనభర్జన జరిగింది. పెద్దఎత్తున పరిశోధన జరిగింది. కానీ, దీనికి కర్తలెవరో తెలియలేదు. కొంతమంది ఖైదీల నడత అధికారులకు చికాకుగా ఉండేది. ఒకరోజు రాత్రి లాకప్పయ్యాక-సూపరింటెండెంట్ వెళ్లిపోయాక- క్రింది తరగతి ఉద్యోగులు తలుపులు తెరిచి

**(మిగతా 26వ పేజీలో)**